క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): కలెక్టర్ ఆనంద్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. నియోజకవర్గంలోని పలు మండలాల సమస్యలను కలెక్టర్‌కు తెలియజేశారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం



నెల్లూరు సిటీ: మెదడు సంబంధిత సమస్యతో బాధపడుతున్న రెండేళ్ల బాలుడి వైద్య ఖర్చులకు రూ.10 వేల ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. పవర్ యూత్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకొని దర్గామిట్టలోని కార్యాలయంలో ఈ మొత్తాన్ని వారికి ఇచ్చారు. సంస్థ అధ్యక్షుడు ముని వెంకటసూర్య, ధనలక్ష్మి, అభిషేక్, సాయిరెడ్డి, రమేష్, హేమంత్, బాలాజీ, వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ విధుల్లో విద్యార్థులు



నెల్లూరు(క్రైమ్): రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని ట్రాఫిక్ విధులను నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు శుక్రవారం నిర్వర్తించారు. గాంధీబొమ్మ, వీఆర్సీ, మద్రాస్ బస్టాండ్, ఆర్టీసీ, కేవీఆర్ పెట్రోల్ బంక్, జిల్లా పోలీస్ కార్యాలయ జంక్షన్లలో ట్రాఫిక్ సిబ్బందితో కలిసి నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్, సీట్ బెల్టు ప్రాధాన్యాన్ని తెలియజేశారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గంలోని 22వ డివిజన్లో గల శాస్త్రిగారి వీధిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనను ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శుక్రవారం చేపట్టారు. పనులను 15 రోజుల్లో పూర్తి చేస్తామని చెప్పారు. నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కంటే సాయిబాబా, కార్పొరేటర్ మూలె విజయభాస్కర్‌రెడ్డి, బీజేపీ నేత యరబోలు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు రూరల్: యువత కోసం ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత పాఠశాల విద్య, ఐటీఐ, డిగ్రీ, పూర్తి చేసిన 21 నుంచి 24 ఏళ్లలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 12 నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నారని, ఆ సమయంలో నెలకు రూ.ఐదు వేలతో పాటు రూ.ఆరు వేల ఏకకాల గ్రాంట్‌ను అందజేయనున్నారని పేర్కొన్నారు. అర్హులు ఆధార్, బయోడేటా వివరాలతో ఆన్‌లైన్లో రిజిస్టర్ చేసుకోవాలని, వివరాలకు 77807 50871, 80746 34065 నంబర్లను సంప్రదించాలని సూచించారు. దీనికి సంబంధించిన గడువు ఈ నెల 21తో ముగియనుందన్నారు.

20న షాపుల వేలం

నెల్లూరు(సెంట్రల్): మద్రాస్ బస్టాండ్ సమీపంలోని కోనేరులో నిర్మించిన షాపుల వేలాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నారు. మొత్తం 140 షాపులకు గానూ 152 దరఖాస్తులను ఔత్సాహికులు పొందారు. ఇందులో దాదాపు 90 దరఖాస్తులు అందాయి. కాగా పండ్ల వ్యాపారానికి సంబంధించిన షాపులకే వేలం వేయనున్నామని అధికారులు తెలిపారు.



అమ్మో.. బొమ్మ..!



తినుబండారాల రేట్ల పట్టిక

- థియేటర్లంటేనే బెంబేలెత్తుతున్న ప్రేక్షకులు
- రెట్టింపవుతున్న టికెట్ ధరలు
- తినుబండారాల రేట్లతో గుండె గుబిల్లు

సినిమా.. ఎంతో మందికి ఇది వినోదం. తక్కువ ధరకే ఇంటిల్లిపాది థియేటర్‌కు వెళ్లి తమ అభిమాన నటుడి చిత్రాన్ని చూసి.. ఇంటర్వెల్లో తమకు నచ్చిన తినుబండారాలను ఆరగించి ఎంతో మధురానుభూతిని పొందేవారు. అయితే ఇదంతా గతం. ప్రస్తుతం ఆకాశాన్నంటుతున్న టికెట్ రేట్లు.. సామాన్యుడికి అందుబాటులో లేని స్నాక్స్ ధరలతో థియేటర్‌వైపు వెళ్లాలంటేనే ఎంతో మంది జంకుతున్నారు. తమ పిల్లలు మారం చేస్తుండటంతో కొందరు విధి లేక అప్పులు చేసి మరీ వెళ్లాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది.

నెల్లూరు సిటీ: సినిమా.. రెండు నుంచి మూడు గంటల నిడివి ఉండే దీన్ని కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా చూసి.. ఇంటర్వెల్ సమయంలో ఓ పాప్‌కార్న్, సమోసా, పఫ్, కూల్‌డ్రింక్‌ను తీసుకునే వారు. మొత్తం ఖర్చులు రూ.500 నుంచి రూ.800 అయ్యేవి. మధ్యతరగతి వారికి ఇది భారంగా ఉండేది కాదు. అయితే ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది.

అప్పులు చేస్తూ..

సినిమాకు తీసుకెళ్లాలని పిల్లలు కోరితే.. కాదనలేక.. తమ స్తోమతకు మించి ఖర్చు చేయలేక ఇంటి పెద్ద లోలోన నలిగిపోతున్నారు. కొంతమంది అప్పులు చేసి మరీ తమ పిల్లల సంతోషాలను తీరుస్తున్నారు. మరికొందరు ముందూ వెనుకా చూడకుండా క్రెడిట్ కార్డుల్లో డబ్బులు ఖర్చు చేసి నెలాఖరులో బిల్లు చెల్లింపు కోసం తిరిగి అప్పులు చేస్తున్నారు. దాదాపు 20 శాతం కుటుంబాల పరిస్థితి ఇంతే కావడం గమనార్హం.

జేబులకు చిల్లు

సంక్రాంతి సమయంలో అనేక చిత్రాలు విడుదలవుతాయి. పండగ నిమిత్తం దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు తమ కుటుంబసభ్యులతో కలిసి సినిమా చూడాలని కోరుకుంటారు. దీంతో భారీగా లాభాలు సాధించాలనే ఉద్దేశంతో ప్రభుత్వాలను ఒప్పించి టికెట్ ధరలను నిర్మాతలు పెంచుకుంటున్నారు. థియేటర్ నిర్వాహకులు తినుబండారాలపై అధిక ధరలు వసూలు చేస్తూ ప్రేక్షకుల జేబులకు చిల్లులు పెడుతున్నారు.

తారెత్తిస్తున్న రేట్లు

నగరంలో మొత్తం 16 స్క్రీన్లు ఉన్నాయి. సంక్రాంతి సందర్భంగా విడుదలైన సినిమాలకు ఒక్కో టికెట్‌కు రూ.300 నుంచి రూ.335 వరకు వసూలు చేస్తున్నారు. ఓ కుటుంబం వెళ్లాలంటే దాదాపు రూ.1200 నుంచి రూ.1400 వరకు అవుతోంది. మామూలు రోజుల్లో టికెట్ ధరను రూ.177గా నిర్ణయించినా, ఆ రేటు ఉండేది ఎప్పుడో ఎవరికీ తెలియదు.

మరోవైపు రెండు నెలల క్రితం స్మాల్ పాప్‌కార్న్ రూ.140 ఉండగా, ప్రస్తుతం రూ.200కు చేరింది. లార్జ్ పాప్‌కార్న్ రూ.230 ఉండగా, ప్రస్తుతం రూ.340కు ఎగబాకింది. క్రీమ్‌డోనట్, కూల్‌డ్రింక్స్, ఎగ్‌పఫ్.. ఇలా ప్రతి ఒక్క రేటూ విపరీతంగా పెరిగింది. సామాన్యులకు అందుబాటులో వినోదం లభించేలా టికెట్ ధరలను సవరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఖర్చులెక్కువైనా తప్పడం లేదు



పండగ సమయంలో పిల్లలకు దుస్తులు, ఇంట్లోని తినుబండారాలకే అప్పులు చేయాల్సిన పరిస్థితి ఉంది. అయితే వారి సంతోషం కోసం ఒక్క సినిమానైనా చూపించక తప్పడం లేదు. మల్టీప్లెక్సుల్లో టికెట్ ధరలు, తినుబండారాల రేట్లను రెండింతలు పెంచారు. దీంతో సినిమాకు వెళ్లాలంటేనే భయమేస్తోంది.

– సుధాకర్, నవాబుపేట

అందుకే ఓటీటీలో చూస్తుంటా

కొత్త సినిమాలకు ఇష్టారాజ్యంగా ధరలు పెంచుతున్నారు. మరోవైపు థియేటర్లలో తినేందుకు ఏమి కొనుగోలు చేయాలన్నా, చుక్కలు కనపడుతున్నాయి. అందుకే కొంత ఆలస్యమైనా ఓటీటీల్లోనే సినిమా చూస్తున్నా.

– వాసు, మైపాడు గేట్

థియేటర్లకు వెళ్లే వారు తగ్గారు



చిత్రాలను గతంలో 100 రోజులు నుంచి 150 రోజులు ప్రదర్శించేవారు. ఇప్పుడు 20 నుంచి 30 రోజులు ఉంటే బ్లాక్ బాస్టర్ మూవీగా నిలుస్తోంది. టికెట్ ధరలు పెంచడంతో కొన్ని రోజుల్లోనే కలెక్షన్లు వస్తున్నాయి. వాస్తవానికి గతంతో పోలిస్తే సినిమాలు చూసే వారి సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఇదే ధరలు కొనసాగితే పరిస్థితి మరింత దారుణమయ్యే అవకాశం ఉంది.

– ప్రసన్నకుమార్‌రెడ్డి

త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవం నేడు

నెల్లూరు(బృందావనం): బహుళ పంచమిని పురస్కరించుకొని వేదాయపాళెంలోని త్యాగరాజస్వామి మందిరంలో ఆరాధన మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నామని త్యాగరాజ సేవా సమితి నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభిషేకాలు, నామార్చనలు, త్యాగరాజ స్వామి వారి భక్త బృందంతో బిక్షాటన, నగర సంకీర్తన తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. ఈ ఏడాది మార్చిలో నిర్వహించనున్న త్యాగరాజ స్మరణోత్సవాల్లో ఆలపించాలనుకునే వారు తమ దరఖాస్తులను శనివారం అందజేయాలని, వివరాలకు 94401 64423 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడూ, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నవలాకులతోట సబ్‌స్టేషన్లో మరమ్మతులను చేపట్టనున్న క్రమంలో పలు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా శని, ఆదివారాల్లో ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హరనాథపురం, రామ్మూర్తినగర్, రేబాలవీధి, రైతుబజార్, మార్కెట్ యార్డ్, శెట్టిగుంట రోడ్డు, బోడిగాడితోట, ఎన్టీఆర్‌నగర్, యలమలవారిదిన్నె, జగదీష్‌నగర్, అల్లీపురం టిడ్కో సబ్‌స్టేషన్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. కొన్ని సబ్‌స్టేషన్లకు ఇతర ఫీడర్ల నుంచి విద్యుత్ సరఫరా చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

➡ కోడూరుపాడు, నారాయణరెడ్డిపేట, నవలాకులతోట, కొత్తకాలువ, ఇండస్ట్రియల్ ఏరియా, అల్లీపురం, పెద్దచెరుకూరు, గుడిపల్లిపాడు, చింతారెడ్డిపాళెం, రాజుపాళెం గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని నెల్లూరు రూరల్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న నేతలు

నెల్లూరు(అర్బన్): ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ సూచించారు. ఓ కార్యక్రమం నిమిత్తం నెల్లూరు వచ్చిన ఆయన దర్గామిట్టలోని ఎన్జీఓ భవన్‌లో ఆ సంఘ నేతలు, కార్యవర్గ సభ్యులతో మాట్లాడారు. ఉద్యోగులకు ప్రభుత్వమిచ్చిన హామీలను అమలు చేసే దిశగా ఒత్తిడి తెస్తున్నామని చెప్పారు. ఉద్యోగులు ఐక్యంగా నిలిచి పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్కాకుల పెంచలయ్య, ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, ఆంజనేయవర్మ, విజయకుమార్ పాల్గొన్నారు.

నగర డీఎస్పీగా సింధుప్రియ

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగర డీఎస్పీగా సింధుప్రియను నియమిస్తూ డీజీపీ ద్వారకాతిరుమలరావు ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా సింధుప్రియది తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా వీరారెడ్డిపల్లి. సీడీపీఓగా పనిచేస్తూ 2022లో ఏపీపీఎస్సీ గ్రూప్ – 1 పరీక్ష రాసి డీఎస్పీగా ఎంపికయ్యారు. ప్రొబేషన్ పూర్తి చేసుకొని పోస్టింగ్ కోసం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో వెయిటింగ్‌లో ఉన్నారు. తాజా నియామకాల్లో నెల్లూరు నగర డీఎస్పీగా ఆమె నియమితులయ్యారు.

యోగి వేమన జయంతి రేపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): యోగి వేమన జయంతిని పురస్కరించుకొని నగరంలో యోగి వేమన భగవాన్ ఊరేగింపు వేడుకలను ఆదివారం నిర్వహించనున్నామని త్రైత సిద్ధాంతం – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు కమిటీ అధ్యక్షుడు సురమౌళి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శాంతినగర్‌లోని రెడ్ల ఐక్యవేదిక కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మాగుంట లేఅవుట్లోని అనిల్ గార్డెన్స్‌లో జయంతి సభను మధ్యాహ్నం 12కు నిర్వహించనున్నామని వివరించారు. తొలుత ఊరేగింపును చేపట్టనున్నామన్నారు. రెడ్ల ఐక్యవేదిక నెల్లూరు అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బీవీ రెడ్డి, పెంచలనరసయ్య, ప్రసాద్, సుధాకర్ ఆచారి, శరత్‌రెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

లార్వా, ఫీవర్ సర్వేల పరిశీలన



నెల్లూరు(అర్బన్): వేదాయపాళెం పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని సప్తగిరి కాలనీలో డెంగీ కేసు నమోదైన నేపథ్యంలో అక్కడ వైద్య, ఆరోగ్య శాఖ మలేరియా సహాయాధికారి నాగార్జునరావు శుక్రవారం పర్యటించారు. లార్వా, ఫీవర్ సర్వేను పర్యవేక్షించిన అనంతరం స్థానికులతో మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

ధనలక్ష్మీపురంలో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జడ్జి వాణి

నెల్లూరు సిటీ: ధనలక్ష్మీపురంలోని విజయ నర్సింగ్ హోమ్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి మాట్లాడారు. లింగ నిర్ధారణ చేపట్టడం చట్టవిరుద్ధమని, దీని నిరోధానికి పీఎన్డీటీ చట్టం అమల్లోకి వచ్చిందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మహిళల అక్రమ రవాణా జరుగుతోందని, ఇలాంటి వాటిపై సమాచారం అందించాలని కోరారు. నర్సింగ్ హోమ్ ప్రిన్సిపల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

20లోపు దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (టౌన్): నగరంలోని కస్తూరిదేవి ఉన్నత పాఠశాలలో పోస్టులను భర్తీ చేయనున్నామని డీఈఓ బాలాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ (గణితం) రెండు చొప్పున, బయలాజికల్ సైన్స్, ఫిజికల్ సైన్స్, హిందీ ఒక్కో పోస్టును డైరెక్ట్‌గా భర్తీ చేయనున్నామని చెప్పారు. అర్హులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సురేష్‌రెడ్డికి సత్కారం

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డిని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్ శుక్రవారం సత్కరించారు. ఆయన మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కాంక్షించారు. జనార్దన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఏ సమావేశం


నెల్లూరు (టౌన్): దర్గామిట్టలోని జెడ్పీ హైస్కూల్లో మహజన టీచర్స్ అసోసియేషన్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఈఎఫ్ జాతీయ నేత మందా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంటీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి చేవూరు మస్తాన్‌మాదిగ, పెంచలయ్య మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కలయికతో అసోసియేషన్‌ను ఏర్పాటు చేశామని వివరించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా దుగ్గినపల్లి రవిప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా భూమన శ్రీశైల ఎన్నికయ్యారు. పూలే టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అన్నం శ్రీనివాసులు, సురేష్,, రిపబ్లిక్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఖాజారహంతుల్లా, నేతలు సుధాకర్, పేరయ్య, పండిత పరిషత్ రాష్ట్ర నేత శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

➡ మహజన టీచర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్లను హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ ఆవిష్కరించారు.

నేటి నుంచి ఆర్ట్ ఎగ్జిబిషన్

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని రీడింగ్ రూమ్‌లో కలర్స్ ఆఫ్ నెల్లూరు ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను శనివారం నుంచి మంగళవారం వరకు నిర్వహించనున్నామని చిత్రకారుడు అమీర్‌జాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఎనిమిది మంది ఆర్టిస్టుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

స్వచ్ఛంద సంస్థల సహకారం అభినందనీయం



మాట్లాడుతున్న సుజాత

నెల్లూరు(అర్బన్): జిల్లాలో కుష్టు వ్యాధిని నియంత్రించడంలో స్వచ్ఛంద సంస్థల సహకారం మరువలేనిదని డీఎంహెచ్‌ఓ సుజాత పేర్కొన్నారు. జిల్లాలో కుష్టు వ్యాధిపై సర్వేను ఈ నెల 20 నుంచి నిర్వహించనున్న తరుణంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సర్వేలో స్వచ్ఛంద సంస్థలు పాల్గొనాలని కోరారు. సర్వే చేసే విధానం, అనుమానితుల గుర్తింపు, వారికి చేయాల్సిన పరీక్షలు తదితరాలను వివరించారు. టీబీ, కుష్టు వ్యాధి నియంత్రణాధికారి ఖాదర్‌వలీ, న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ సురేంద్రబాబు, నరసింహులు, ప్రసాద్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణాలకు నోటీసులివ్వండి



భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో అనుమతుల్లేకుండా నిర్మించిన భవనాలను గుర్తించి యజమానులకు నోటీసులను జారీ చేయాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. ఆత్మకూరు బస్టాండ్, జేమ్స్ గార్డెన్, రామ్మూర్తినగర్, రామలింగాపురం తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలేసే వారిని గుర్తించి జరిమానాలను విధించాలని ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణను నూరు శాతం నిర్వహించాలని సూచించారు. డివైడర్లు, ట్రాఫిక్ ఐల్యాండ్లలో పచ్చదనాన్ని పెంపొందించి వాటిని పరిరక్షించాలని కోరారు. భూగర్భ డ్రైనేజీ విధానంపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరూ తమ ఇంటి డ్రైన్‌కు అనుసంధానం చేసేలా చూడాలని సూచించారు. అనధికార ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులను తొలగించాలని చెప్పారు. అనంతరం రామలింగాపురం కూడలిలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ చైతన్య, ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ రహంతుజానీ, హార్టికల్చర్ ఏడీ ప్రదీప్‌కుమార్, ఏసీపీ ప్రకాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

➡ టౌన్ ప్లానింగ్ విభాగ అనుమతులను ఉల్లంఘించి చేపట్టిన భవన నిర్మాణాలను పునాదుల దశలోనే గుర్తించి తొలగించాలని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగాధికారులు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులతో సమావేశాన్ని కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ సమయంలో అనుమతులు, ప్లాన్ నమూనాలు అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని, అలా వ్యవహరించని వారికి నోటీసులను జారీ చేయాలని సూచించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు తీసుకోకుండా భవనాలను వాణిజ్యావసరాలకు వినియోగిస్తున్న వారిని గుర్తించి వెంటనే నోటీసులను జారీ చేయాలని చెప్పారు. అనుమతుల్లేని ఫ్లెక్సీలను గుంజలతో సహా తొలగించాలని పేర్కొన్నారు. ప్రకటనలకు సంబంధించిన పన్నులను వసూలు చేయాలని కోరారు. అనధికార లేఅవుట్లను గుర్తించి వాటి యజమానులకు అవగాహన కల్పించి క్రమబద్ధీకరించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గానూ 45 / 2 సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శి పార్థసారథికి షోకాజ్ నోటీస్‌ను జారీ చేయాలని ఆదేశించారు. సిటీ ప్లానర్ హిమబిందు, డీసీపీ పద్మజ, ఏసీపీ వేణు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల నిర్వహణను మెరుగుపర్చండి

కార్పొరేషన్ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, వాటి నిర్వహణ తీరును మెరుగుపర్చాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. అన్న క్యాంటీన్ల నోడల్ అధికారులు, నిర్వాహకులతో తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యత, పరిమాణాన్ని మెరుగుపర్చి, రుచిగా ఉండేలా పర్యవేక్షించాలని కోరారు. ప్రతి క్యాంటీన్లో ఏడుగురు సిబ్బంది ఉండేలా చూడాలని సూచించారు. సిబ్బంది, విజిటర్స్ హాజరు పట్టిక, ఫిర్యాదుల పట్టికలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. క్యాంటీన్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పర్యవేక్షించాలని ఆదేశించారు. స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. నోడల్ అధికారులు చెన్నుడు, వేణు, రహంతుజానీ, డాక్టర్ చైతన్య, శ్రీనివాసులు, శేషగిరిరావు, ఇనాయతుల్లా, క్యాంటీన్ల నిర్వాహకులు గణేష్, అనిల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆవిష్కరిస్తున్న కలెక్టర్



డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో..

నెల్లూరు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయాధికారుల సంఘ డైరీ, క్యాలెండర్లను కలెక్టర్ ఆనంద్ శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి, ఆత్మ పీడీ శివన్నారాయణ, హరి కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్లను నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాత ఆవిష్కరించారు. అనంతరం ఆమెను సత్కరించారు. ఏడీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, పీహెచ్‌సీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, ప్రసాద్, మాలిని, దేవరకొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.